# పెన్నేటి కతలు

## ఈ పక్క పారే ఏరు ఆ పక్క ఎండే పైరు!

అప్పుడప్పుడూ గుడ్డిసోపరంగా 1. అయినట్టు గానే ఈ ఏడు గూడా సినపుషాల 2. పోక తరికే నేల మెత్తంగ పదునయింది. రోయ్యిబోయి ముగ సిర వొచ్చి సల్లబడ్తానే సెనిక్కాయి సేలకు ఎరువూ మట్టీ దోలి గుల్లబడగ 3. సేద్యం సేసి పెట్టుకొన్నారు. ఎండ తగ్గి సల్లబడడంతో, రెండు పూట్లా సేద్యాలూ ఎరువులూ తోలు కొని వారం రోజుల్లోనే ఊరంతా పని వొంగ దీసిరి. 4. సెనిక్కాయి సేల సేద్యం ముందు గానే అయిపోయినోళ్ళు జొన్న సేలగ్గూడా ఒకటికి రెండు సార్లు పాపనం 5. అదీ జేసుకోని సేలను అద్దాల మాదిరి, అప్పుడే మంగలోడు గడ్డం గొరిగినాక కనపడే మొకాల మాదిరి మెరిపిచ్చిరి.

''పదునాయె, పరుగులాడి పరుగు
లాడి పనులన్నీ లడీ జేసుకొంటిమి,
ఇంగ ఇత్తనం వానపడేదుంది యమగండం''

అనుకొంటావుండంగా, ఎవురో, కుర్చిరాపో పాపం, అని పంపినట్టుగా ఆదలాబాదలా వచ్చి ఆ వాన గూడా పడెనబ్బా. ఆ రోజు వానొస్తాదవి ఊళ్ళో ఒక పిట్ట గూడా అనుకోలా. అట్లాటిది సగిరపొద్దు 6. దాటి నాంక మొదులు పెట్టి పరీగ్గా అంబళ్ళ పొద్దుదాంకా తిప్పిచ్చి మల్లిచ్చి 7. కొట్టె!

ఆ వానట్ట ఎలిసిందో 8. లేదో మల్ల అంత లోకే, కమ్మాన్ల మిద్దె గంగిరెడ్డీ, తూరుపింటి సుబ్బయ్యా, ఇంగా మూన్నాలు గింద్లోళ్ళు వసా ర్లల్లో సెనిక్కాయలు పోసి మాదిగోళ్ళ పిల్లో ళ్ళను తోలుకొచ్చి కూకోబెట్టి పప్పులు ఒలిపిచ్చ బట్టిరి. వాళ్ళన్జూసి ఊరంతా ఇంగ తొక్కు లాట.9 ఇత్తనాల కాయిలు దాపెట్టుకున్నోళ్ళు ఇట్లా తొక్కులాడుతాంటే లేనోళ్ళు మాత్రం తనకలాడిరి 10 ఈకసాల 11. చూసి యిదే వాటమనుకొని మాడిమిద్దె ఎంగ్రెడ్డీ, ఈది లోళ్ళ నారాయణ అల్లుడూ పొద్దుటూరుకీ ఇంగా ఆడికీ యీడికీ బోయి లారీల్తో కాయి తీసుకొచ్చి అలివిగాని దర పెట్టి అమ్మబట్టిరి. అప్పయితే నూటికి అయిదూప దీవ్రెడ్డీ, కల్లం లోకి కాయిలొచ్చినాంక వాళ్ళకే అమ్మేతట్టు కరారు... ఇట్లా కడ్డీపన్లు 12.

కాయిల్లేనోళ్ళు సేసేదేముంది మల్ల? ఆల్చెం కాయిలు రుదా సేసుకొంటావుండాం అని తెల్చినా ఇత్తన మేయాల ఒక్కోసారి. అదున్లో ఇత్తనం బూమిలో బూడ్చితే మల్లెట్టన్నా అయి తాది, అవతల నాలుగు సినుకులు రాలకపోతాయా అనుకోనీ, ఇప్పుడెయ్యకపోతే మల్లా వానొచ్చేతలికి అదును దాటిపోతాదనీ, అరగొర పదునైనా ఇత్తన మేయాల. సినుకులు పన్నాయా మొలకలు వస్తాయి, పడక పాయెనా ఇత్తనాలు పాయె. లేదూ, ఆ అరగొర పదునుకే మొల్చినయి మొల్చినట్టు! అదీ కత.

సరి... ఎట్లనో కట్ట సావుజంపుల్తో 13. కాయ లున్నోళ్ళు, లేనోళ్ళు అందరూ ఇత్తనాలు



జేస్తే నేల్లో ఆ పదును గూడా ఆరిపోతే అవతల నెత్తిన సేతులేసుకోని ఏడుస్తా కూకోవాల. యాటా పడే బాదే ఇది. ఇదొకటేగాదు. పడాల్చిన బాదల్లో ఏ బాదా తప్పదు. తప్పితే, నేనేనా అంత పనికిమాలినదాన్ని అని కోపగిచ్చు కొంటాయేమోనిపిస్తాది. ఈ యిత్తనాల కాయి లుండాయే, ఇయి కొనేటప్పుడు నిప్పులయితే, పండినాక అమ్మేతప్పుడు బొగ్గులు. ఆ దరలూ, ఆకతలూ కస్టాలూ సెప్పాలంటే ఇప్పుడుగాదు, నేను సచ్చేంతవరకూ సెప్పినా అయింగా బతికే వుంటాయి.

అందువల్ల ఇప్పటి కతే సెప్తాను. ఇత్తనాల ఏసుకొన్ని. ఈసారి నేల్లో బాగా పదుముందిగదా, అందువల్ల రెక్కలిచ్చుకొంటా లేసిన కోడి పెట్టల మాదిరి సెనిక్కాయి సెట్లు పచ్చంగా యిచ్చుకొంటావచ్చె. ఏ సేను సూసినా కండ్లకు సల్లదనం ఇస్తా కత్తిరమెట్లు 14. పడేప్పటికే గుంటికె కనపడకుండా కప్పుకొనిపాయె. ఆ సేలను కండ్లారా సూసుకొనే రైతుల పంగతి ఏం చెప్తవులే!

ఊళ్ళో అందరికీ ఏందో పక్కలిగిలి బెట్టి నట్టుగా, సంబరమే సంబరం, నగులే నగులు! యాడ సూసినా, ఎవురికెవురు ఎదురుపన్నా, అతగాని సేను అట్టుందంటే, ఇతగాని సేను

26-5-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

ఇట్టుందని సెప్పుకోడాలు! సేలల్లో సెయ్యాల్సిన పనేమీ ల్యాకపోయినా, ఊరికెనే అట్ట ఏదో పనున్నట్టు పోయి వచ్చేవాళ్ళు. మొగోళ్ళే కాదు, ఆడోళ్ళు కూడా ఏ గడ్డికో పోయి సేలు సూసొచ్చి సెప్పుకోవాల్సిందే!

అట్టా వున్నప్పుడు అటాత్తుగా ఆయం పొట్న దెబ్బ తాకితే, అంతవరకూ నగుతా నగుతా వుండిన మొకంలో నొప్పి కనపడినట్టు అయిపాయె. రోజు రోజుకూ తీగెలు సాగుతా పెరుగుతా వచ్చిన సెనిక్కాయ పైరు, ఆగి పోయి ఆ మొయిన వాడిపోబట్టె. పైరు ఎట్ట వాడిపోబట్టెనో అట్టనే వాళ్ళ మొకాలు గూడా వాడిపోబట్టె. అందుకే, సేలల్లో పైరెట్టుందో తెల్సుకోవాలంటే ఊళ్ళో మనుసుల మొకాలు సూడాలనేది.

వాడిపోయే పైరును సూల్లేక సేలకు పోవ డమే మానుక్రొని. ఇరాటపరవం సదివిచ్చిరి, పోతురాజుకూ, కట్టాలమ్మకూ నీళ్ళు పోసిరి, సీతారాముల పెండ్లి జేసిరి. ఎన్ని జేసినా సినుకు నేల్న రాలకపాయె. వస్తాదని యెవురూ అను కోనప్పుడు వచ్చిన వాన, వస్తాది వస్తాదని ఎగజూసి నప్పుడు ఎగ్గొట్టె. ఎగ్గొట్టింది ఎగ్గొట్టినట్టుండగ, ఏరు పారిచ్చి ఏడిపిచ్చె! ఆ రోజు తెల్లవారుజాము సీకటి ఇంగా ఇచ్చిపోకముందే... ఏటి మీద ఎల్తర పర్సినట్టు 15. ఎక్కడ జూసినా పరవళ్ళు తొక్కే నీళ్ళు!

అంటే ఎగువ వెక్కన్నో బెమ్మాండమైన వాన కుర్సిందన్నమాట. ఇంతకు ముందు ఇట్టా ఏరు పారినప్పుడంతా సూడ్డానికి రొండు కండ్లూ సాలనట్టు సంతోసంగా సూస్తావుండేవాళ్ళు. ఏరు పారడమూ సూపిందే, పైరు ఎండడమూ సూపిందే. రొండిట్నీ ఒక్కసారి16 సూడ్డమే సెప్పలేని బాద! ఇప్పుడు ఒక కంటిలో పారే ఏరు కనిపిస్తాంటే, ఇంగో కంటిలో ఎండే పైరు కనిపిస్తా వుంటాది.

రొండు కండ్లూ దగ్గరే, అయినా అయి రొండూ కల్సేందుకు ఇంత ఎడమా?

—రామకృష్ణారెడ్డి

1. అదృష్టవశాత్తు 2. పువర్వసు 3. మెత్తగా 4. పూర్తిజేసిరి 5. సేద్యంలో ఒక పద్దతి 6. అర్ధరాత్రి 7. కుండపోతగా 8. ఆగిందో 9. తొందరపడిరి 10. గిరాకీ 11. కండిషన్స్ (షరతులు) 12. వృథా 13. కష్టాలతో 14. గడ్డిని చంపే సేద్యం 15. వెలుతురు 16 సారి







''పశుగ్రాసం తయారీ యంత్రాల దిగుమతి కుంభకోణంలో బలరాం జక్కర్'' - వార్త




